www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 30 డిసెంబర్ 2024

5

కాకినాడ



నేడు యథావిధిగా పిజిఆర్‌ఎస్ కార్యక్రమం

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన పిజిఆర్‌ఎస్ కార్యక్రమం నేడు జిల్లాలో యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే పిజిఆర్‌ఎస్ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ విధిగా ఉదయం 9:30 గంటలకు హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

ఆచరణకు వచ్చేనా..?

- డిజిటలైజేషన్‌కు దూరంగా గ్రంథాలయాలు
- సిబ్బంది కొరతతో సతమతం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జిల్లాలోని గ్రంథాలయాలు డిజిటలైజేషన్ ప్రక్రియకు ఎప్పుడు నోచుకుంటాయో ప్రశ్నార్థకంగా మారింది. గత వైసిపి ప్రభుత్వం వీటిని అభివృద్ధి చేస్తామని దానిలో భాగంగానే డిజిటలైజేషన్ చేపడతామని చెప్పుకొచ్చినా ఆచరణలో అమలు కాలేదు. డిజిటలైజేషన్‌తో ప్రపంచంలోని పురాతన గ్రంథాలు, చరిత్రలు పాఠకులు తెలుసుకునే అవకాశం ఉంటుంది. అయితే దీనిని పూర్తి చేయాలంటే క్షేత్రస్థాయిలో పలు సమస్యలను పరిష్కారించాల్సి ఉంటుంది. ముఖ్యంగా సిబ్బంది కొరతను అధిగమించేందుకు ఖాళీ పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

జిల్లా కేంద్రం కాకినాడలో ఒక కేంద్ర గ్రంథాలయంతో పాటు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 102 శాఖాగ్రంథాలయాలు, 14 గ్రామీణ గ్రంథాలయాలు, 145 పుస్తక నిక్షిప్త కేంద్రాల ద్వారా పాఠకులకు సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం వీటిలో సుమారుగా 14,54,930 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో వసతి సమస్యలతో కాకినాడలోని శ్రీనగర్ శాఖా గ్రంథాలయం, జగన్నాథపురం బాలల గ్రంథాలయం మూతపడ్డాయి. దీంతో మొత్తం 36 గ్రంథాలయాలకు గానూ 34 గ్రంథాలయాలు పని చేస్తున్నాయి. అదనంగా 2 గ్రామ గ్రంథాలయాలు, 53 బుక్ డిపాజిట్ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ప్రతి రోజూ కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి సుమారు 200 మంది, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మిగతా గ్రంథాలయ శాఖలకు దాదాపు 10 వేల మంది వరకూ పాఠకులు వస్తుంటారు. 89,987 మంది డిపాజిట్ చేసిన సభ్యులున్నారు. ఏడాదికి 30 నుంచి 33 లక్షల మంది పాఠకులు గ్రంథాలయాలకు హాజరవుతున్నారు.

డిజిటలైజేషన్‌తో ఎన్నో ఉపయోగాలు

ఆధునాతన సాంకేతికత అందుబాటులోకి వచ్చినా సామాజిక మాధ్యమాలు ఎన్ని పుట్టుకొచ్చినా గ్రంథాలయాలకు ఆదరణ మాత్రం తగ్గలేదు. పోటీ పరీక్షల కోసం గ్రామీణ విద్యార్థులు నేటికీ వాటిపైనే ఆధారపడుతున్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న గ్రంథాలయాలను అభివృద్ధి చేయాల్సిన పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో పలు జిల్లాల్లో గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేస్తున్నా ఉమ్మడి జిల్లాలో మాత్రం అటువంటి చర్యలేమీ చేపట్టడం లేదు. గత కొన్నేళ్లుగా ఇక్కడ సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఈ సమస్యను అధిగమించి గ్రంథాలయ శాఖ డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పాఠకులు కోరుతున్నారు. గ్రంథాలయాల్లో సిబ్బంది, ఇతర సమస్యల పరిష్కారం కోసం, పుస్తకాల డిజిటలైజేషన్‌కు వెంటనే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రంథాలయాలు డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేయాలని, మారుతున్న కాలానుగుణంగా గ్రంథాలయాలు కంప్యూటరీకరణకు చేపట్టాలని, దీని ద్వారా విలువైన సమయం ఆదాయం రావడంతోపాటు, అవసరమైన పుస్తకాల గుర్తింపులో ఖచ్చితత్వం ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ ప్రక్రియ ద్వారా ఏ పుస్తకం ఏ గ్రంథాలయంలో అందుబాటులో ఉందో కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది. ముఖ్యంగా విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ విధానం ఎంతో సులువుగా ఉంటుంది. ఈ-గ్రంథాలయాలకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ఈ విధానాన్ని త్వరలోనే జిల్లాలో అమలు చేయాలని పాఠకులు కోరుతున్నారు.



వేధిస్తున్న సిబ్బంది కొరత

గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేయాలంటే అవసరమైన కంప్యూటర్లను అందుబాటులో ఉంచడంతోపాటు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాల్సి ఉంది. పూర్తిస్థాయిలో పుస్తకాలు ఉంచాలి. అభివృద్ధికి నిధులను కేటాయించాలి. అలాగే సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాలి. అయితే జిల్లాలో పలు గ్రంథాలయాల్లో సిబ్బంది కొరత ఎక్కువగా వేధిస్తోంది. రెగ్యులర్ ఉద్యోగులు 204 మందికి గానూ 62 మంది మాత్రమే పని చేస్తుండగా ఇంకా 142 ఖాళీ పోస్టులున్నాయి. ఔట్‌సోర్సింగ్ పోస్టులు 37 ఉండాలి. అయితే ప్రస్తుతం 29 మంది పని చేస్తున్నారు. అలాగే విలేజ్ లైబ్రేరియన్స్ 51 మంది గాను కేవలం ఐదుగురు మాత్రమే పని చేస్తున్నారు. ఇంకా 46 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పార్ట్ టైం వర్కర్లు ఐదుగురికి గానూ ఒక్కరే పని చేస్తున్నారు.



మహాసభలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పోరాటం

ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా మహాసభలో రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్

ప్రజాశక్తి - శంఖవరం

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పోరాడాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్ పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా 29వ మహాసభ అన్నవరం శేషాద్రి సదన్‌లో ఆదివారం ప్రారంభమైంది. తొలుత ఎస్ఎఫ్ఐ జెండాను జిల్లా అధ్యక్షులు పి.వరహాలు ఆవిష్కరించారు. అనంతరం అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటాలకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్, జిల్లా నాయకులు శ్రీకాంత్, చిన్ని, లలిత పూలమాల వేసే నివాళులర్పించారు. మహాసభ సందర్భంగా ఇటీవల మరణించిన అమరవీరులకు సంతాప తెలిపింది. అనంతరం వెంకటేష్ మాట్లాడారు. ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ అలుపెరగని పోరాటం నిర్వహిస్తుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. నూతన జాతీయ విద్యా విధానం వల్ల విద్యావ్యవస్థ కార్పొరేట్ పరం అవుతుందన్నారు. విద్యను కాషాయీకరణ చస్తున్నారని విమర్శించారు. పాఠశాలల విలీనంతో విద్యార్థులు ప్రయివేటు విద్యాసంస్థలకు తరలివెళ్లాల్సి వచ్చిందన్నారు. జిఒ 77 వల్ల పేద విద్యార్థులకు ఉన్నత విద్య దూరమైందన్నారు. వెంటనే ఈ జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అందరికీ తల్లికి వందనం డబ్బులు ఇస్తామని చెప్పి నేటికీ రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కనీసం ఎప్పుడు అమలు చేస్తారనేది కూడా చెప్పడం లేదన్నారు. దీనిపై తక్షణం రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. మెస్, కాస్మోటిక్ ఛార్జీలను నేటి ధరలకు అనుగుణంగా పెంచాలన్నారు. పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ మహాసభలో రాబోయే సంవత్సరం కాలం పాటు ఉద్యమ ప్రణాళికను రూపొందించుకుని ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణ కోసం కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా కమిటీకి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు, జిల్లా నాయకులు శ్రీకాంత్, చిన్ని, లోవరాజు, సిద్ధు, వెంకటేశ్, గోపాలకృష్ణ, సాహిత్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఎఫ్ఐ పతాకానికి సెల్యూట్ చేస్తున్న ప్రతినిధులు


అల్లూరి, భగత్‌సింగ్, అంబేద్కర్ చిత్రపటాలకు నివాళి

కెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

నగర పంచాయతీ పరిధిలో సొసైటీలో సభ్యత్వం కల్గిన రైతులు, రుణాలు తీసుకున్నవారు తప్పనిసరిగా కెవైసి చేయించుకోవాలని గొల్లప్రోలు విశాల సహకార పరపతి సంఘం సెక్రటరీ ఆదిరెడ్డి సూరిబాబు తెలిపారు. దగ్గరలోని సచివాలయ సిబ్బంది మీ దగ్గరికి వచ్చిన లేక ఫోన్ ద్వారా ఓటిపి అడిగినా వారికి సహకరించాలని ఆయన కోరారు.

పంచాయతీల్లో ఎస్‌సి వర్గీకరణ సర్వే నివేదిక

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎస్‌సి వర్గీకరణ సర్వే నివేదికను పంచాయతీలు, సచివాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సర్వే జాబితాపై అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 31లోగా దరఖాస్తు చేయాలన్నారు. అభ్యంతరాలు ఉంటే విఆర్‌ఒలను కలిసి ఫిర్యాదు చేయవచ్చున్నారు. జనవరి 10వ తేదీన షెడ్యూల్ కులాల తుది జాబితా సిద్ధమవుతుందని తెలిపారు.

ఎన్‌టిఆర్ బీచ్‌లో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ బీచ్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆది వారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు మాట్లాడారు. విద్యా ర్థులు స్వచ్ఛ సంకల్ప భావంతో 'స్వచ్ఛతాహి సేవ' కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని అన్నారు. విద్యార్థులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. అటవీ శాఖ సిఎఫ్ఒ బిఎన్ఎన్. మూర్తి స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులను అభినందించారు. తదుపరి విద్యార్థులు బృందాలుగా విడిపోయి జలచరాలకు ఇబ్బంది కలిగించే ప్లాస్టిక్ స్పూన్‌లను, వలముక్కలను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సత్యనారా యణ, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్.వరప్రసాద్, శ్రీదీప్తి, సెక్షన్ ఆఫీసర్ నాగార్జున, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వర రావు, గౌరీప్రియ, వాలంటీర్లు పాల్గొన్నారు.


చెత్తను సేకరిస్తున్న ఆదిత్య ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

సంక్రాంతి సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ జి.శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని తాటిపర్తి గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు, గుండాట, పేకాట, బొమ్మ బొరుసు, వంటి క్రికెట్ బెట్టింగ్, ఇతర జూద క్రీడలు నిర్వహించినా, వాటిలో పాల్గొన్న చర్యలు తప్పవన్నారు. సాంప్రదాయ పద్ధతిలో సంక్రాంతి పండుగ నిర్వహించుకోవాలని సూచించారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిం చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ క్రైమ్, డిజిటల్ అరెస్టుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎన్.రామకృష్ణ, పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐ శ్రీనివాస్

సమరోత్సాహంతో ముందుకు...

- ముగిసిన సిపిఎం జిల్లా మహాసభ
- ఉత్తేజ పరిచిన నాయకులు ప్రసంగాలు
- జిల్లా కార్యదర్శిగా అరుణ్ ఎన్నిక
- కార్యదర్శి వర్గ సభ్యులుగా రాంబాబు, తులసి, పవన్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రెండు రోజుల పాటు రాజమహేంద్రవరం జరిగిన సిపిఎం జిల్లా మహాసభ ఆ పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహాన్ని నింపింది. నాయకులు ప్రసంగాలు ఉత్తేజ పరిచాయి. పలు ప్రజా సమస్యలపై మహాసభ చర్చించి కార్యాచరణకు దిశానిర్దేశం చేసింది. ప్రజాపోరాటాలతో ముందుకు సాగేందుకు నూతన కార్యవర్గం సిద్ధమైంది.

నగరంలోని రౌతు తాతాలు కళ్యాణ మండపంలో ఆదివారం రెండో రోజు సిపిఎం జిల్లా మహాసభ జరిగింది. తొలుత ఆ పార్టీ సీనియర్ నాయకులు కెఎస్.ప్రకాష్ సిపిఎం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారు లు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

అనంతరం జువ్వల రాంబాబు, బి.పవన్, పి.తులసి అధ్యక్ష వర్గంగా ప్రతినిధుల సభ జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడారు. కవులు, కళాకారులకు పుట్టినిల్లైన రాజమహేంద్రవరం అభ్యుదయ, సాంఘిక ఉద్యమాలకు వేదిక అన్నారు. గత వారసత్వాన్ని కొనసాగించేందుకు సిపిఎం శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉభయ గోదావరి జిల్లాల సారూప్యతను వివరించారు. స్వాంతంత్ర్య పోరాటంలోనూ ఈ ప్రాంత ప్రత్యేకతను గుర్తు చేశారు. కమ్యూనిస్టులు నిర్వహించిన పోరాటాలు, విజయాలను ప్రస్తావించారు. కేంద్రంలో బిజెపి హయాంలో ఎన్‌డిఎ సర్కారు ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందన్నారు. ప్రజాస్వామ్యానికి, లౌకికతత్వానికి, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తుందన్నారు. అవే విధానాలను కూటమి ప్రభుత్వమూ అనుసరిస్తోందన్నారు. చాతుర్వర్ణ వంటి ప్రమాదకర సంస్కృతిని ఎంపీ పురంధేశ్వరి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్వాగతిస్తారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో వైసిపికి ప్రతిపక్ష అర్హత లేదన్నారు. గత వైఫల్యాలను ఆత్మవిమర్శ కూడా చేసుకోలేని స్థితిలో ఆ పార్టీ ఉందన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన గురుతర బాధ్యత కమ్యూనిస్టులపైనే ఉందన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజలకు అండగా ప్రతిపక్ష పాత్ర పోషించాలన్నారు. ఆ దిశగా రాబోయే రోజుల్లో జరిగే పోరాటాలకు నాయకత్వం వహించాలన్నారు.

భద్రాచలం మాజీ ఎంపీ మిడియం బాబూరావు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో కుల, వర్గ, మత వంటి సామాజిక విభజన ఉన్నప్పటికీ కమ్యూనిస్టులను అందరూ స్వాగతిస్తారన్నారు. ఆదర్శవంతమైన వ్యక్తిగత, విప్లవ జీవన విధానమే దీనికి కారణమన్నారు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత సుందరయ్య వారసత్వాన్ని కొనసాగించాలన్నారు. కేంద్రంలోని బిజెపి సర్కారు అదానీ, అంబానీలకు దేశ సహజ వనరులను కారుచౌకగా దోచి పెడుతుందన్నారు. అటువంటి లూటీని ఎండగడుతూ ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రస్తుతం పాలకులు ప్రజలను మభ్యపెట్టి రాజకీయాలు చేస్తున్నారని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన విజన్-2047 దీనిలో భాగమేనన్నారు. రాబోయే రోజులలో సుశక్తి కల్గిన సైనికులను తయారు చేసేందుకు ఈ మహాసభ నాంది పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుందరబాబు, కెఎస్‌వి.రామచంద్రరావు, వై.బేబిరాణి, పి.తులసి, బి.పవన్, ఎన్.రాజా, సీనియర్ నాయకులు ఎస్ఎస్.మూర్తి, పోలిన వెంకటేశ్వరరావు, టిఎస్.ప్రకాష్, ఐద్వా నాయకులు జరీనా, వెంకటలక్ష్మి, సిపిఎం నగర కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ మిడియం బాబూరావు, సిపిఎం పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ నాయకులు టిఎస్.ప్రకాష్

సిపిఎం జిల్లా కార్యదర్శిగా అరుణ్


టి.అరుణ్, జిల్లా కార్యదర్శి


తూర్పుగోదావరి జిల్లా మహాసభలో భాగంగా నూతన జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. మొత్తం 12 మందితో నూతన కమిటీ ఎన్నికైంది. జిల్లా కార్యదర్శిగా టి.అరుణ్ మరోసారి ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా జువ్వల రాంబాబు, బి.పవన్, తులసి ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా ఎం.సుందరబాబు, కెఎస్‌వి.రామచంద్రరావు, ఎన్.రాజా, కర్రి రామకృష్ణ, బివిఎన్.పూర్ణిమ రాజు, వై.బేబిరాణి, అరుణ, ఐ.సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు


జువ్వల రాంబాబు


బి.పవన్


పి.తులసి



కుంభకర్ణ నిద్రలో కేంద్ర ప్రభుత్వం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపిడిఒ శ్రీలలిత

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక గోకులంలో ఆదివారం అబాకస్ అకాడమీ నిర్వహించిన కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంపిడిఒ శ్రీలలిత సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ పెద్దాపురం అకాడమీ విద్యార్థి ఎన్.జస్వంత్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభను చాటుకుని అవార్డును సాధించారని అన్నారు. చిన్ననాటి నుంచి అబాకస్ నేర్చుకోవడం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, తార్కిక ఆలోచన, స్థిరత్వం పెరుగుతాయన్నారు. ఈ కార్య క్రమానికి అబాకస్ స్టేట్ కోఆర్డినేటర్ ఎం.శ్రీకాంత్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ విఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్ అవినీతి వల్లే విద్యుత్ భారాలు

ప్రజాశక్తి - సామర్లకోట



జగన్ అవినీతి కోసం చేసిన ఒప్పందాల వల్లే నేడు ప్రజలపై విద్యుత్ భారాలు పడ్డాయని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆరోపించార. ఆదివారం అచ్చంపేటలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిగులు విద్యుత్‌తో ఉన్న రాష్టాన్ని జగన్ అవినీతి వల్ల విద్యుత్ రంగం నష్టాల్లోకి నెట్టబడిందన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో 10 దఫాలు విద్యుత్ ఛార్జీలను పెంపుదల చేసి ప్రజలపై రూ.32 వేల కోట్ల భారాలను వేశారని గుర్తు చేశారు. మైలవరం సోలార్ ప్లాంట్లపై దాడిచేసి ధ్వంసం చేశారన్నారు. చట్టవిరుద్ధంగా పిపిఎలను రద్దు చేయడం వల్ల తక్కువ ధరకు వచ్చే 7 వేల మెగావాట్లు విద్యుత్‌ను రాష్ట్రం కోల్పోయిందన్నారు.. సెకి ఒప్పందంలో జగన్ రూ.1750 కోట్లు లంచాలు పుచ్చుకున్నారని అమెరికా కోర్టులో కేసు నమోదు అయ్యిందని, ఈ సెకి ఒప్పందం వల్ల విద్యుత్ సంస్థలకు ఏడాదికి రూ.3850 కోట్లు మొత్తం 30 ఏళ్లకు లక్ష కోట్లు వినియోగదారులపై భారాలు మోపారని అన్నారు. రాష్ట్ర విద్యుత్ రంగాన్ని నాశనం చేసిన జగన్ నేడు ధర్నాలు చేయాలని పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందన్నారు.

సామాజిక కార్యకర్త ధూళిపూడి బాబికి సత్కారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సామాజిక కార్యకర్త ధూళిపూడి బాబిని పలువురు సత్కరించారు. ఆదివారం కాకినాడలో జరిగిన బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ 18వ వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని పి.మల్లవరంకి చెందిన ధూళిపూడి బాబిని అతిథులు పద్మశ్రీ డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్, డాక్టర్ మధు ఉద్దిరాజులు సత్కరించి సర్టిఫికెట్ అందించారు. ఈ సందర్భంగా బాబి మాట్లాడుతూ ప్రతీ కుటుంబం నేత్రదానం మీద అవగాహన కల్పించుకోవాలని, మనిషి మరణానంతరం కళ్ళు మాత్రమే 6 గంటలుపాటు పనిచేస్తాయని తెలుసుకుని నేత్రదానం చేయించడానికి ముందుకు రావాలని సూచించారు.



సర్టిఫికెట్ అందుకుంటున్న బాబి

70 ఏళ్లు దాటితే ఉచిత ఆరోగ్య బీమా

ప్రజాశక్తితో డిఎం అండ్ హెచ్‌ఒ నరసింహనాయక్



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వ సహకారంతో 70 సంవత్సరాలు పైబడిన వారందరికీ ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి జె.నరసింహ నాయక్ తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో ఆరోగ్య బీమా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆయుష్మాన్ భవ పథకాన్ని ఈ ఏడాది సెప్టెంబర్లో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా 70 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తిస్తుందన్నారు. జిల్లాలోని సుమారు 90 వేల మంది 70 ఏళ్ల పైబడిన వద్దులు ఉన్నారన్నారు. దేశంలోని 6 కోట్ల మంది సీనియర్ సిటిజన్లతో సహా 4.5 కోట్ల కుటుంబాలకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరనుందన్నారు. ఈ పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.ఐదు లక్షల బీమా వర్తిస్తుందని చెప్పారు. దీని కోసం సీనియర్ సిటిజన్లందరికీ ప్రత్యేకంగా కార్డులు జారీ చేస్తారన్నారు. ఈ పథకం కింద ఎవరెవరు ప్రయోజనం పొందవచ్చు? ప్రయివేట్ ఆరోగ్య బీమా ఉన్నవారికి ఇది వర్తిస్తుందా? లాంటి విషయాలను 'ప్రజాశక్తి' ముఖాముఖిలో ఆయన వివరించారు.

ఉచిత బీమా ఎలా అమలవుతుంది.?

పిఎంజెఎవై పథకాన్ని 2018లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించారు. పేద కుటుంబాలకు ఈ పథకం కింద ఆరోగ్య సేవలు అందుతున్నాయి. 70 ఏళ్ల పైబడి, ఆర్థిక పరిస్థితులకు సంబంధం లేకుండా రూ.5 లక్షల ఆరోగ్య బీమా అందుబాటులోకి తెచ్చింది. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరడానికి మూడు రోజుల ముందు వరకు అయ్యే వైద్య పరమైన ఖర్చులకు సైతం నగదు రహిత కవరేజీ ఉంటుంది. చికిత్స సమయంలో మందులు ఉచితంగా అందిస్తారు. గుండె సంబంధ వ్యాధులకు అమర్చే స్టంట్లు, బైపాస్, వాల్వులు, జెనరల్ సర్జరీలో ఉండి పొందే చికిత్సకు బీమా వర్తిస్తుంది. రోగికి చికిత్స సమయంలో భోజనం ఉచితంగా అందిస్తారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత 15 రోజుల పాటు చికిత్సకు అయ్యే ఖర్చులకు చెల్లింపులు అందుతాయి. ఈ పథకం కింద ఇప్పటికే వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించి ఆయుష్మాన్ కార్డులు జారీ చేశారు.

ఉచిత ఆరోగ్య బీమా ఎలా పొందాలి.?

ప్రస్తుతం 70 ఏళ్లు నిండిన వృద్ధులు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.పిఎంజెఎవై.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని ఆయుష్మాన్ కార్డు పొందవచ్చు. అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే పేదలందరికీ ఈ పథకం కింద రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూరుతోంది. ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించి కార్డులు జారీ చేశాం. తాజాగా ఆర్థిక, ఆదాయ పరిస్థితులకు సంబంధం లేకుండా 70 ఏళ్లు నిండిన వృద్ధులకు ఈ పథకం వర్తింప జేస్తున్నారు. వీరికి కూడా రూ.5 లక్షల ఆరోగ్య బీమా వర్తిస్తుంది. ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేసుకునే వెసులుబాటును కేంద్రం కల్పించింది.

ప్రయోజనం ఎవరికి, ఎంత ?

ఆదాయంతో సంబంధం లేకుండా ఈ బీమా సౌకర్యాన్ని పొందవచ్చు. అందుకోసం సీనియర్ సిటిజన్లకు ప్రత్యేకంగా కార్డులు జారీ చేస్తారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. ఇప్పుడు చిన్న కుటుంబాలు అయిపోయాయి. అందువల్ల, వృద్ధుల సామాజిక భద్రత, ఆరోగ్య సంరక్షణ ఇది అవసరం. ఒక కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది వృద్ధులు ఉంటే, వారికీ బీమా పంపిణీ అవుతుంది. అలాగే, ఆయుష్మాన్ భారత్ పథకంలో లేని 70 ఏళ్ల పైబడిన వారు కూడా ఈ పథకంలో చేరవచ్చు.

ఎవరు అర్హులు కారు?

కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాలైన (సిజిహెచ్ఎస్), ఎక్స్-సర్వీస్‌మెన్ కాంట్రిబ్యూటరీ మెడికల్ స్కీమ్ (ఇసిహెచ్ఎస్), సాయుధ దళాల ఆయుష్మాన్ పథకం (సిఎపిఎఫ్) వంటి బీమా పథకాలకు అర్హులైన 70 ఏళ్లు దాటిన వారందరూ ప్రస్తుతం వర్తిస్తున్న స్కీమ్‌లోనే కొనసాగవచ్చు. లేదా ఈ కొత్త పథకంలో చేరొచ్చు. అయితే, వీటిలో ఏదో ఒక పథకం కింద మాత్రమే ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది.

నేరాలు ఘోరాలు

పోక్సో కేసులో నిందితుని అరెస్ట్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరంలో బాలిక అదృశ్యం కేసులో పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితుని అరెస్టు చేశారు. బాలిక ఆచూకీ కనుక్కుని అందుకు కారణమైన ధవళేశ్వరంలోని వాడపేటకు చెందిన పేర్ల జాన్‌ను అరెస్ట్ చేసినట్లు సిఐ టి.గణేష్ తెలిపారు.

ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరు మృతి

ప్రజాశక్తి - యంత్రాంగం

వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరు వ్యక్తులు చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. వివరాలు ఇవి..

ముమ్మిడివరం: మోటార్ సైకిల్ పై వెళుతున్న వ్యక్తిని ట్రక్ ఆటో ఢీ కొట్టడంతో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం వ్యక్తి మరణించాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అయినవిల్లి మండలం మాగాంకు చెందిన నక్కా సోమశేఖర్ (32) ఆదివారం ఉదయం మోటార్ సైకిల్‌పై అమలాపురం వెళుతున్నాడు. అనాతవరం వాటర్ ప్లాంట్ వద్ద వెనక నుంచి ట్రక్ ఆటో ఢీ కొట్టడంతో సోమశేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని అమలాపురం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమశేఖర్ మరణించాడు. మృతునికి భార్య అశ్విని ఉన్నారు. ఈ మేరకు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆత్రేయపురం: రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన యువకుడు చికిత్స పొందుతూ రాజమహేంద్రవరం ఒక ప్రయివేటు ఆస్పత్రిలో ఆదివారం మరణించాడు. పోలీసులు వివరాలు ప్రకారం ముమ్మిడివరం గ్రామానికి చెందిన గ్రంధి షణ్ముఖ వీర వెంకటరమణ(18) మండలంలోని పులిదిండి ఇసుక ర్యాంపు లో సూపర్ వైజర్ గా పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే తన పనులు ముగించుకుని ఈ నెల 28న సాయంత్రం పులిదిండి నుండి తన స్నేహితుడు సత్యనారాయణతో కలిసి మోటార్ సైకిల్ పై ముమ్మిడివరం వెళుతున్నాడు. ఈ సమయంలో లొల్ల గ్రామ సమీపంలో ఆర్అండ్‌బి రోడ్డుపై వీరి మోటార్‌సైకిల్‌ను ట్రాక్టం ఢీకొంది. ఈ ఘటనలో మోటార్‌సైకిల్‌పై వెళుతున్న ఇద్దరికీ గాయాలయ్యాయి. వీరిని రాజ మహేంద్రవరం కిమ్స్ ఆస్పత్రి చికిత్స నిమిత్తం తరలించారు. షణ్ముఖ వీర వెంకటరమణ కు పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆసుపత్రి నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు

గంజాయి విక్రయిస్తున్న యువకుని అరెస్ట్

ప్రజాశక్తి - రాజోలు

గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని రాజోలు పోలీసులు అరెస్టుచేసి ఈనెల 28న రిమాండ్‌కు తరలించారు. ఆదివారం రాజోలు ఎస్ఐ బి.రాజేష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజోలు మండలం నున్నవారిబాడవ ఇసుక ర్యాంప్ సమీపంలో గంజాయితో బొండాడ ప్రదీప్ అలియాస్ చింటును పట్టుకున్నట్టు తెలిపారు. అతని వద్ద నుంచి 545 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని రాజోలు కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయికి అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని, దీనిపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని, పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కోడిపందేలపై పోలీసుల దాడి ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - సీతానగరం

నల్లగొండ గ్రామ శివారులో ఆదివారం కోడిపందేలు ఆడుతున్నట్టు సమాచారం అందటంతో సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. గ్రామ శివారు మామిడి తోటలో కోడిపందేలు ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు పరారీలో ఉన్నారు. సంఘటనా స్థలంలో రూ.6700 నగదు, మూడు కోడి పుంజులు, రెండు కత్తులు, 8 బైకులను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. నిందుతులను కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

సారా బట్టీలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - రౌతులపూడి

ఏలేరు కాలవ సమీపంలో సారా బట్టీలు నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారంతో ఆదివారం ఆయా బట్టీలపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, సారా బట్టీ నిర్వహిస్తున్న బత్తిన ఆనంద్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఆటోను అతివేగంగా నడపడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. కోరంగి ఎస్ఐ. పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లరేవు జెల్లవారిపేటకు చెందిన దాసరి నూకరాజు, రవిశర్మ ద్విచక్ర వాహనంపై తాళ్లరేవు నుంచి నీలపల్లి వెళ్తుండగా సుంకటరేవు వద్ద యానం వైపు నుంచి వస్తున్న ఆటో వేగంగా వచ్చి వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తులకి స్వల్ప గాయాలుగా ఆటో డ్రైవర్ కాశీ ఈశ్వరరావు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయాలైన వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ. సత్యనారాయణ తెలిపారు.

గడప లోపలే మతం - గడప దాటితే భారతీయులం

ప్రజాశక్తి - కాకినాడ, యు.కొత్తపల్లి



'గడప లోపలే మతం - గడప దాటితే భారతీయులం' అంటూ 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేస్తూ సిపిఎం రాష్ట్ర కమిటీ రూపొందించిన కరపత్రాన్ని సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక కచేరిపేట వెంకటేశ్వరకాలనీ కూడలిలో జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు జి.బేబిరాణి మాట్లాడారు. భిన్న త్వంలో ఏకత్వమే భారతీయ విశిష్టత అని అన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ తదితర ఏ మతాన్ని అనుసరించినా మనమంతా భారతీ యులమే అన్నారు. దేశ సమైక్యత సమగ్రత, మతసామరస్యం వర్ధిల్లాలని, అందుకోసం ప్రతి ఒక్కరూ నిలబడాలన్నారు. సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ ప్రజల మధ్య స్నేహపూర్వక వాతావరణం వెల్లి విరిసేలా నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదామ న్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ, దుంపల ప్రసాద్, కె.నాగజ్యోతి, నాగాబత్తుల సూర్యనారాయణ, చంద్రమళ్ళ పద్మ, నర్ల ఈశ్వరి, లోవ, కుమారి, మేడిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు. అలాగే యు.కొత్తపల్లి మండలం నాగులపల్లి గ్రామంలో నిర్వహించిన సిపిఎం శాఖ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు జి.బేబిరాణి పాల్గొని మాట్లాడారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పడిన ఏటిగట్లు గండ్లకు తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని ఆమె కోరారు. అనంతరం 2025 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అందరం కలుద్దామనే కరపత్రాన్ని విడుదల చేశారు ఈ కార్యక్రమంలో నాగులపల్లి శాఖ కార్యదర్శి కాళ్ల నాగేశ్వరరావు, నాయకులు జి.వెంకటసుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, కెవివి.సత్యనారాయణ, మోసే పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం - పాయికరావుపేట 132 కెవి విద్యుత్తు లైన్ మార్పు పనుల్లో భాగంగా ఈనెల 30, 31వ తేదీల్లో పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుం దని విద్యుత్ శాఖ అధికారులు ఖాజారహతుల్లా, ప్రభాకర్‌లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా పట్టణ పరిధిలోని కొన్ని ప్రాంతాలతోపాటు, మండల పరిధిలోని సిరివాడ, వడ్లమూరు, జి.రాగంపేట గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

వీధి కళాకారులకు అండగా నిలవాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

తరతరాలుగా కళలనే నమ్ముకుని జీవిస్తున్న వీధి కళాకారులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని ప్రముఖ భజన కళాకారులు ఆలమూరు సుబ్బారావు అన్నారు. ఆదివారం మండలంలోని లింగంపర్తి గ్రామంలో తాడేపల్లిగూడెంకి చెందిన వీధి కళాకారులకు సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజలు వీధి కళాకారులను ఎంతో ఆదరించే వారని, ఇటీవల కాలంలో టివిలు, సినిమాలు రావడంతో వీధి కళాకారులకు కనీసం కడుపునిండా తిండి లేని దుస్థితి నెలకొందన్నారు. వీధి కళాకారుల బృందం నాయకుడు ఎడవల్లి నాగరాజు మాట్లాడుతూ తమ తాత, ముత్తాతల నుంచి కృష్ణుడు, రామాంజనేయులు, కాళికాదేవి, జాంబవంతుడు, శివుడు రూపాల్లో వేషాలు వేస్తూ జీవనోపాధి జీవిస్తున్నామన్నారు. కార్తీక, మార్గశిర మాసాలలో తమ వేషాలను, తాము పాడుతున్న పద్యాల ప్రజలు ఆసక్తి చూపించి ధాన్యం, ధనం, ఇతర నిత్యవసరాలు ధారాళంగా అందించేవారన్నారు. ప్రస్తుతం కనీసం పట్టించుకోవడం లేదని వీధిలోకి వెళ్తే తలుపులు మూసుకుంటున్నారని, తాము నమ్ముకున్న కళలను వదల్లేక వీధి వేషాలు వేసిన తమ అలంకరణకు రంగులు ఇతర వస్తువులకు సైతం డబ్బులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వంశపారంపర్యంగా వచ్చిన వీధి వేషాలు తప్ప తమకు వేరే వృత్తి లేదన్నారు. తమ కళలకు ప్రాచూర్యం సన్నగిల్లుతున్న తరుణంలో జీవనం కష్టతరంగా మారిందన్నారు. కళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలతోపాటు, వివిధ ఉత్సవ సంస్థలు ముందుకు వచ్చి తమకు జీవనోపాధిని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాగు బాబులు, గవరసాని పెద్దకాపు, ఉడతల రమణారావు, మోటే పల్లి నారాయణ, అడపా వీరభద్రరావు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ కోరారు. ఆదివారం మండలంలోని కాట్రావులపల్లిలో ఆటో స్టాండ్ యూనియన్ సభ్యులతో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని, ముఖ్యంగా పాఠశాల విద్యార్థులను దింపే ఆటోలు పరిమితికి మించి ఎక్కించుకోరాదన్నారు. హైవేలో ప్రయాణించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఆటో ఇన్సూరెన్స్ లైవ్‌లో ఉండేలా చూసే బాధ్యత యూనియన్ బాధ్యులు తీసుకోవాలన్నారు. ఆటోలో ప్రయాణించే మహిళలు బ్యాగులను దొంగిలించే వారి పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆటోలకు పోలీస్ నెంబర్ స్టిక్కర్లను అందజేశారు.

వేట్లపాలెంలో ఆర్‌డిఒ, డిఎస్‌పి పర్యటన

ప్రజాశక్తి - సామర్లకోట

ఈ నెల 15వ తేదీన ఇంటి నిర్మాణం విషయంలో ఏర్పడిన వివాదంలో ముగ్గురు హత్యకు గురైన నేపథ్యంలో ఆదివారం వేట్లపాలెం గ్రామంలో ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, డిఎస్‌పి శ్రీహరిరాజు పర్యటించారు. ఈ సందర్భంగా దాడి చేసిన కుటుంబాలతోపాటు, బాధిత కుటుంబాలకు చెందిన వారితో వారు మాట్లాడారు. శాంతిభద్రతలకు భంగం కలగకుండా ఇరు కుటుంబాలకు చెందిన వారి సహకరించాలని కోరారు. జరిగిపోయిన సంఘటన దురదృష్టకరమని సంబంధికులు అందరిపై కేసులు పెట్టడం జరిగిందని, చట్టప్రకారం చర్యలు తప్పక తీసుకుంటారని అన్నారు. అదే సమయంలో ఆవేశ కావేశాలు తగ్గించుకుని జనజీవనం సాధారణ స్థితికి రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముగ్గురి హత్యకు కారకుల్లో కొందరిని అరెస్టు చేశామని, మిగిలిన వారిని త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని గ్రామంలో పోలీస్ పికిటింగ్ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర్‌రెడ్డి, సిఐ ఎ.కృష్ణభగవాన్, రీ సర్వే డిటి యడ్ల శ్రీనివాసరావు, సామర్లకోట ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం యాత్రికులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ రాజమహేంద్రవరంకు చెందిన దాత గొల్లపల్లి ధర్మరాజు, హైదరాబాద్‌కు చెందిన దాతలు మంగిపూడి కళ్యాణ్ రామ్, టంకసాల రామ కంట శేషగిరిరావు ఆర్థియ సాయంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆసాధులు, వేద పండితులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

క్రియ పోటీల్లో కరప విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కరప

ఈనెల 28, 29 తేదీల్లో జెఎన్‌టియుకెలో నిర్వహించిన క్రియా పోటీల్లో కరప జడ్‌పి హైస్కూల్ నుంచి పాల్గొన్న ముగ్గురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటుకుని బహుమతులు సాధించారని పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులు ఎస్.గాంధీవశ్రుతి వెన్నెల, పి.అలేఖ్య, ఆర్.నాగదేవిశ్రీ వివిధ విభాగాల్లో ప్రతిభ కనపరిచి బహుమతులు సాధించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఫోటో బహుమతులు పొందిన కరప విద్యార్థులతో హెచ్ఎం శ్రీనివాస్మ

మరిడమ్మకు బంగారు ఆభరణం బహూకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారికి పెద్దాపురంకు చెందిన పడాల దుర్గారావు, లింగం సాయిచరణ్ లు కలిసి 16 గ్రాముల 30 మిల్లీ గ్రాముల బంగారంతో తయారు చేసిన ఆభరణాన్ని బహుకరించారు. ఆ ఆభరణాన్ని ఆదివారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మికి అందజేశారు.

వెంకటేశ్వరరావుకు కవి పురస్కారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

విజయవాడలో జరిగిన 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో తాళ్లరేవుకు చెందిన పినపోతు వెంకటేశ్వరరావుకు పర్యావరణ కవి పురస్కారం అందుకున్నారు. ఆదివారం విజయవాడ కెబిఎన్ కళాశాలలో జరిగిన యువ రచయతల సమ్మేళనంలో పర్యావరణాన్ని కాపాడుకుందాం అంశంలో ఇకనైనా మేలుకో అనే శీర్షికతో కవితాగానం చేసినందుకు గానూ ప్రథమ బహుమతికి ఎంపికయ్యారు. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రాదరావు చేతులమీదుగా వెంకటేశ్వరరావు పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావును పలువురు అభినందించారు.

'అనంతపురం సిఐపై హత్య కేసు నమోదు చేయాలి'

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

అనంతపురం త్రీ టౌన్ సిఐ శాంతిలాల్‌పై హత్య కేసు నమోదు చేయాలని ఐలాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగత శివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శివ మాట్లాడుతూ సివిల్ వివాదాల్లో పోలీసులు జోక్యం చేసుకోకూడదని ఎన్నోసార్లు హైకోర్టు పోలీసులకు ఆదేశాలు జారీ చేసిందన్నారు అయినా పోలీసులు సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకొని హైకోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తున్నారన్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అనంతపురంలో సీనియర్ న్యాయవాది బివి.శేషాద్రి కేసులో ఇరుగ్రూపులు నోటీసులు అందుకున్నారన్నారు. ఒక తప్పుడు ఫిర్యాదుపై న్యాయవాది శేషాద్రి అతను జూనియర్లు దామోదర్, రామ్మోహన్‌లను స్టేషన్‌కు పిలిపించి త్రీటౌన్ సీఐ శాంతిలాల్ దురుసుగా ప్రవర్తించారన్నారు వారి సెల్‌ఫోన్లను లాక్కున్నారన్నారు. సిఐ ప్రవర్తనతో ఆయన హఠాత్తుగా మరణించారన్నారు. ఈ ఘటన చాలా దురదృష్టకరమన్నారు. సిఐ తీరుపై విచారణ నిర్వహించాలని, కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

యానాం వార్తలు



మన్మోహన్ సింగ్ మృతికి మల్లాడి సంతాపం

ప్రజాశక్తి - యానాం

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో యానాంకు అనేక అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. కేంద్ర ఆర్థిక వ్యవస్థలో కీలక సంస్కరణలు చేసిన వ్యక్తిని కొనియాడారు. భారతరత్న అవార్డుకు అర్హత ఉన్న నాయకుడు మన్మోహన్ సింగ్ అని అన్నారు. త్వరలోనే ఆయనకు భారతరత్న అవార్డు వస్తుందని ఆశిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాడి అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెట్రోలు, డీజిల్‌పై వ్యాట్ పెంపు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం పెట్రోలు, డీజిల్‌పై జనవరి 1 నుంచి విలువ ఆధారిత పన్నును పెంచుతోంది. సవరించిన ధరల ఉత్తర్వులను లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్నాథన్ విడుదల చేశారు. పెట్రోలుపై వ్యాట్ 2.44 శాతానికి, డీజిల్‌పై 2.57 శాతానికి పెంపుదల చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులతో యానాంలో పెట్రోలుపై 15.26 శాతం నుంచి 17.69 శాతానికి, డీజిల్‌పై 6.91శాతం నుంచి 8.65 శాతానికి పన్నులు పెరిగాయి. దీంతో ఒక్కో లీటరు పెట్రోలు, డీజిల్‌పై సుమారు రూ.2 భారం పెరగనుంది. యానాంలో ప్రస్తుతం లీటరు పెట్రోలు ధర రూ.94.92, డీజిల్ రూ.84.75 ఉంది.

4న పరిశుభ్రత కార్యక్రమం

ప్రజాశక్తి - యానాం

వచ్చే నెల 4 నుంచి యానంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాది కృష్ణారావు తెలిపారు. ఆదివారం ఆయన పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 6, 7, 8 తేదీల్లో ప్రజా ఉత్సవాలు, ఫల పుష్ప ప్రదర్శనలు జరుగుతున్న నేపథ్యంలో జనవరి 4వ తేదీన పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. జిఎంసి బాలయోగి క్రీడా ప్రాంగణంలో జరిగే ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా ఉత్సవాలకు ముఖ్యమంత్రి రంగస్వామి, గవర్నర్ కైలాస్ నాదన్, మంత్రులు, ఉన్నతాధికారులు, ఎంఎల్ఎలు పాల్గొంటారని తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తా...

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

జర్నలిస్టుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తానని ప్రత్తిపాడు ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. ప్రత్తిపాడులో ఆదివారం జర్నలిస్టులు ఆత్మీయ కలయికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జర్నలిస్టుల హక్కులను గత వైసిపి సర్కారు కాలరాసిందన్నారు. సమాజంలో జర్నలిస్టులు పాత్ర చాలా కీలకమైందన్నారు. వారి పని కత్తి మీద సాము లాంటిదన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా పనిచేసే ఏకైక వ్యవస్థ పాత్రికేయ రంగమన్నారు. ఇళ్ల స్థలాల లేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. గత వైసిపి సర్కారు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు.

శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని పనసపాడు గ్రామంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ క్రిస్టియన్లకు శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని శెట్టిబలిజ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాల్, చైతన్య బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి శివరామకృష్ణ, రాయుడు మోజెస్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పనసపాడులో వారు మీడియాతో మాట్లాడుతూ ఇటీవల డిఆర్‌ఒను కలిసి శ్మశాన వాటికల సమస్యలను వివరించినట్లు చెప్పారు. పనసపాడు గ్రామానికి చెందిన 233 సర్వే నెంబర్ బండి బాట రోడ్డుని కబ్జా చేసి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు లేవన్నారు. ఈ సమావేశంలో ఈ కార్యక్రమంలో జిల్లా శెట్టిబలిజ నాయకులు గుత్తుల జాను, ఎ. నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో సిఐ తనిఖీలు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మామిడాడ గ్రామ శివారున కోడి పందాలు నిర్వహించే పలు ప్రాంతాలను సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ సిబ్బందితో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా గతంలో కోడిపందేలు నిర్వహించిన వారు ఎవరూ, కోడికి కత్తులు కట్టే వారి వివరాలపై స్థానిక ప్రజల నుంచి ఆరా తీశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎవరైనా కోడిపందాలు నిర్వహిస్తున్నట్లుగాని, అందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే 9440796529 నెంబర్‌కి సమాచారం ఇవ్వాలని గ్రామస్తులను కోరారు.

ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి - రౌతులపూడి

రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ కొండూరు మరినీయను దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మరినీయ మాట్లాడుతూ దళితుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ప్రస్తుతం దళితుల ఎదుర్కొంటున్న సమస్యలను పలువురు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజా సమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కొంకిపూడి రాజ్యలక్ష్మి, సత్య ప్రకాష్, సత్యనారాయణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు విద్యుత్ కాంతులు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం నగర పంచాయతీ యంత్రాంగం నిర్వాకంతో కొన్ని ప్రాంతాల్లో వీధిలైట్లు పగలు కూడా వెలుగుతూనే ఉన్నాయి. యూనియన్ బ్యాంక్ ఎదుటి వీధిలో వీధిలైట్లు రాత్రి, పగలు తేడా లేకుండా వెలుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. బల్బులు మాడిపోతే నెలలు తరబడి కొత్త బల్బులు వేయకుండా ఆ ప్రాంతం అంతా చీకటి మయంగా మారుతుందని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేకసార్లు మున్సిపల్ ఆఫీస్ చుట్టూ తిరిగి వేయించుకున్న లైట్లు పగలు కూడా వెలగడం వలన మున్సిపాలిటీకి



విద్యుత్ ఛార్జీలు పెరిగి ఆ భారం ప్రజల పైనే పడుతుంది. ఇప్పటికైనా అధికారులు వీధిలైట్లు రాత్రులు మాత్రమే వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.